
చోరీ జరిగిన నాగేశ్వర్‌రావు ఇంటి గది

# ఆకులవారి ఘనపూర్‌లో చోరీ

**రెండిళ్లలో నగదు, బంగారం అపహరణ**

ఏటూరునాగారం, అక్టోబర్ 10 : మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపూర్‌లోని నెండ్రకంటి నాగేశ్వర్‌రావు ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. నాగేశ్వర్‌రావు ఇంటి పక్క పోర్షన్‌లో విద్యుత్‌శాఖ ఉద్యోగి శ్రావణ్‌కుమార్ కూడా ఉంటున్నారు. ఈ రెండు కుటుంబాలు వేర్వేరుగా రెండు రోజుల క్రితం వరంగల్ వెళ్లారు. ఈ క్రమంలో దొంగలు నాగేశ్వర్‌రావు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న 15తులాల బంగారం, 80 తులాల వెండి, రూ. 4లక్షల నగదును ఎత్తుకెళ్లారు. శ్రావణ్‌కుమార్ ఇంటి తలుపులు కూడా పగులగొట్టి ఇంట్లో ఉన్న నగదు రూ.5వేలు చోరీ చేశారు. శ్రావణ్‌కుమార్ మంగళవారం ఉదయం ఇంటికి రాగానే తలుపులు తెరిచి ఇంట్లో సామానులు చిందరవందరగా ఉండడంతో నాగేశ్వర్‌రావుకు సమాచారం ఇచ్చారు. కాగా, నాగేశ్వర్‌రావు కుటుంబం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంట్లో ఉన్న బంగారం, నగదు అపహరించుకపోయారని కుటుంబ సభ్యులు గుర్తించారు. కాగా, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కృష్ణ ప్రసాద్ చోరీ జరిగిన ఇండ్ల పరిశీలించారు. గత వారం రోజుల క్రితం కూడా రెండు చోట్ల మండలంలో చోరీ జరిగింది. వరుసగా జరుగుతున్న చోరీలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

# చిన్న జిల్లాలు.. ప్రగతి ఖిల్లాలు

- మెరిసిన నల్లనేల
- అందుబాటులోకి పాలనా సౌధాలు
- ప్రజలకు చేరువైన ప్రభుత్వ పాలన
- చింత తీర్చిన కొత్త జిల్లాలు
- తప్పిన వ్యయప్రయాసలు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటై ఏడేళ్లు పూర్తి
- నేడు నూతన జిల్లాల ఆవిర్భావ దినోత్సవం



భూపాలపల్లిలో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయం

జయశంకర్ భూపాలపల్లి. అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాలన ప్రజల ముంగిట్లోకి వచ్చిన వేళ. ప్రభుత్వ ఆఫీసులకు పనులపై సద్ది కట్టుకుని మరీ వెళ్లి ఒక రోజంతా తిరిగి ఏ రాత్రో ఇంటికి చేరుకునే వ్యయ ప్రయాసలు తప్పిన వేళ. ప్రజల చింత తీర్చి కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన వేళ. సరిగ్గా నేటికి ఏడేళ్లు. 2016 అక్టోబర్ 11న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ 22 కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకుని అమలు చేశారు. ప్రజలకు పాలన చేరువ చేశారు. ప్రతి సర్కారు కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. భూపాలపల్లిలోనే కలెక్టరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి వరంగల్‌కు వెళ్లే ఇబ్బందులను తప్పించారు. 11 మండలాలతో కలిపి కొత్త జిల్లాను ఏర్పాటు చేసి జిల్లాకు జయశంకర్ భూపాలపల్లిగా నామకరణం చేశారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రజలు ఏ మారుమూల గ్రామంలో ఉన్నా గంట, గంటన్నరలో భూపాలపల్లికి చేరుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసుకుని వెళ్తున్నారు.

### ఏడేళ్ల క్రితం..

ఏడేళ్ల క్రితం భూపాలపల్లి వరంగల్ జిల్లా పరిధిలో ఉండేది. తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్ మినహా ఇక్కడ ఏ కార్యాలయాలూ ఉండేవి కావు. జిల్లా స్థాయి అధికారిని కలవాలంటే 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న వరంగల్‌కు వెళ్లాల్సి వచ్చేది. రోడ్లు సక్రమంగా ఉండేవి కావు. వెళ్లడానికి మూడు గంటలు.. రావడానికి మూడు గంటలు పట్టేది. అక్కడ పనులు చూసుకుని ఏ రాత్రో ఇంటికి చేరుకునేవారు. కాళేశ్వరం, మహదేవపూర్, మహాముత్తారం, కాటారం తదితర మారుమూల గ్రామాలు కరీంనగర్ జిల్లా పరిధిలో ఉండేవి. ప్రజలు సుమారు 100 కిలోమీటర్ల పైనే దూరం ఉన్న కరీంనగర్‌కు వెళ్లి రావడానికి నరకం కనపడేది. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంథని నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాలను కలుపడంతో వారికి ఇబ్బందులు తప్పాయి. ఇదిలా ఉండగా ములుగు ప్రాంత ప్రజలు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండి అభివృద్ధికి దూరంగా ఉండేవారు. ఈ ప్రాంతాన్ని సైతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనే కలుపగా అనంతరం పాలనా సౌలభ్యం కోసం సీఎం కేసీఆర్ ములుగును ప్రత్యేక జిల్లా చేశారు.

### అభివృద్ధి పరుగులు

అన్ని జిల్లా స్థాయి కార్యాలయాలను భూపాలపల్లిలోనే నెలకొల్పడంతో అభివృద్ధి పరుగులు పెట్టింది. భూపాలపల్లి జిల్లాగా మారిన ఏడేళ్లలో ఊహించని ప్రగతి కనిపిస్తున్నది. జిల్లాగా మార్చిన కొత్తలో కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడానికి భవనాలు లేకపోవడంతో సింగరేణి సంస్థ సహకారం అందించింది. సంస్థకు చెందిన భవనాల్లో కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, దేవాదుల భవనంలో ఆర్డీవో కార్యాలయం, ఐటీఐ భవనంలో ప్రగతి భవన్ ఏర్పాటు చేసి అందులో అన్ని విభాగాల జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు పాలన చేరువ చేశారు. సింగరేణి క్వార్టర్లను కొన్ని ఉన్నతాధికారుల నివాసాలకు కేటాయించారు. ప్రస్తుతం రూ.59.45 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని నిర్మించి అందులోకి 33 జిల్లా కార్యాలయాలను తరలించారు. అలాగే అత్యాధునిక హంగులతో రూ.25 కోట్లతో జిల్లా పోలీస్ కార్యాలయం ఏర్పాటు చేసి ఆ శాఖకు సంబంధించి అన్ని కార్యాలయాలను అందులోకి తరలిస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టు, సబ్‌కోర్టులను ఏర్పాటు చేసి వరంగల్, పరకాలకు వెళ్లే ఇబ్బందులను ప్రభుత్వం తప్పించింది. రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ములుగులో ఉండగా ప్రస్తుతం భూపాలపల్లిలోనే ఏర్పాటు చేశారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పీఆర్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయాలన్నీ భూపాలపల్లికి తరలివచ్చాయి.

### పెరిగిన ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి

భూపాలపల్లి ఇప్పటికే సింగరేణి పారిశ్రామిక ప్రాంతం కావడం, అందులోనూ జిల్లాగా మారడంతో ఇక్కడ ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరిగాయి. జిల్లా ఏర్పాటుతో ప్రత్యక్షంగా ఉపాధి పొందేవారితో పాటు ఆయా ప్రాంతాల నుంచి నిరుద్యోగులు ఇక్కడికి వచ్చి వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రభుత్వం పెరిగిన జనాభాకు అనుగుణంగా భూపాలపల్లికి కోట్లాది రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి చేసింది. కేవలం ఏడేళ్లలో భూపాలపల్లి రూపురేఖలు మారిపోయాయి. జిల్లా కేంద్రంలో 500 పడకలతో ప్రభుత్వ దవాఖాన అందుబాటులోకి రావడంతో పాటు 50 పడకల ఆయుష్ ఆసుపత్రి రేపో మాపో అందుబాటులోకి రానుంది. ఈ విద్యా సంవత్సరం మెడికల్ కళాశాల ప్రారంభమైంది. మరో ఏడాదిలో ఉన్నతస్థాయి పట్టణాల జాబితాలో చేరుతుందనడంలో ఆశ్చర్యం లేదు.

# మురిసిన ములుగు..

- అభివృద్ధిపథంలో అడవుల ఖిల్లా
- ప్రజా సేవకు మెరుగైన సౌకర్యాలు
- ములుగులో అన్ని కార్యాలయాలు అందుబాటులోకి
- రాష్ట్రంలో చివరి జిల్లాగా ప్రత్యేక గుర్తింపు
- పర్యాటక పరంగా అభివృద్ధి
- రామప్పకు యునెస్కో గుర్తింపు
- గిరిజన ప్రాంతంలో విద్యావ్యవస్థ బలోపేతం

ములుగు, అక్టోబర్10 (నమస్తే తెలంగాణ) : ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకొని స్వరాష్ట్రంలో తెలంగాణను 33 జిల్లాలుగా ఏర్పాటు చేసి పాలనను ప్రజల చెంతకు తెచ్చారు. 2016లో దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 11న రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాలను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ములుగు జిల్లాలోని తొమ్మిది మండలాలను జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో విలీనం చేశారు. అనంతరం 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవంబర్ 30న జరిగిన ప్రగతి నివేదిన సభలో ములుగు ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అన్న మాట ప్రకారం 2019 ఫిబ్రవరి 17న తన పుట్టిన రోజు కానుకగా ములుగును 33వ జిల్లాగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అన్ని జిల్లాలతో సమానంగా నిధులను కేటాయించడంతో నాలుగేళ్లుగా జిల్లాలోని తొమ్మిది మండలాలు ఎంతో అభివృద్ధి చెందాయి. ప్రజలకు సేవ చేసేందుకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నియమించడంతో పాటు అన్ని కార్యాలయాలను అందుబాటులోకి తేవడంతో మెరుగైన సేవలు అందుతున్నాయి. కరోనా సమయంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు ప్రభుత్వం అన్ని జిల్లాల మాదిరిగానే అత్యవసరమైన మందులు, ఆక్సిజన్ సిలిండర్లను అందించడంతో అధిక ప్రాణ నష్టం తప్పడంతో పాటు ప్రజలకు ఆర్థిక భారం తప్పింది,

### ఇతర జిల్లాలతో పోటీగా అభివృద్ధి

రాష్ట్రంలో చివరి జిల్లాగా ఏర్పడిన ములుగు ఇతర జిల్లాలతో పోటీ పడి అభివృద్ధి చెందుతున్నది. జిల్లా ఏర్పడిన తర్వాతే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చింది. దీంతో తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తమైంది. పర్యాటక పరంగా కూడా జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతూ వస్తున్నది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతర కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా మెరుగైన సౌకర్యాలతో విజయవంతంగా నడుస్తున్నది. వైద్యం పరంగా రాష్ట్రంలో కేవలం రెండు జిల్లాల్లో మాత్రమే హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమం ప్రారంభించగా అందులో ములుగు జిల్లాకు సైతం చోటు లభించింది. ప్రభుత్వం మెడికల్ కాలేజీ మంజూరు రూ.180కోట్ల నిధులను విడుదల చేసింది. గత నెల 28న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు మెడికల్ కాలేజీ పనులను ప్రారంభించారు. విద్య పరంగా కూడా ప్రభుత్వ నిధులతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమై గిరిజన ప్రాంతానికి చెందిన ప్రజలకు విద్యా సౌకర్యాలు మెరుగుపడ్డాయి.


ములుగులో చకచకా సాగుతున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844. NT-320501

PLOT FOR SALE



★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 1 గుంట భూమి 2 లక్షలు మాత్రమే (121 గజాలు). యాదాద్రి దగ్గర... ఆలేరు వద్ద. అతి తక్కువ ప్లాట్లు కలవు. Cont: 8008091512. స్పాట్ రిజిస్ట్రేషన్. NT-317956

★Wanted receptionist (Female) More details Contact : Mobile No. 9908846622 KMM-00

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640468899, 9640258899. NT-310350

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618 9182777213
WARANAGAL 9182777556 9182777557 9182777558
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565